ర్థమే అవుతాయి. అగుట, చైతన్యం పురుష ప్రయత్నంమీద వ్యక్తి అలవరచుకొన గలడు కాని, మరి యే యితర విధానం కాదు. ఈ చైతన్యానికి జ్ఞానం కావాలి, జ్ఞానమన ప్రకృతి సూత్రాల నెఱిగి, వాటిని తనలో ఆకళింపు చేసుకోనడమే. ప్రకృతి ఇపుడు ఇదివరకంతటి భయానక మయింది కాదు. దానిని పూర్తిగా జయించక పోయినా - చాలామటుకు స్వాధీనపఱచుకుని దానిని మానవ సుఖానికి అనువైనట్టు చేసికొనగలిగిన వీల్లు నేటి శాస్త్రీయ జ్ఞానం ఇస్తోంది. ఆ వీల్లు అందరికీ కలిగేటట్టు - అందరూ తెలిసికొని వాటిని ఆచరింపగలుగునట్లు చెయ్యాలి.

అందుచేత పదార్థవాది విద్య ప్రతివ్యక్తికీ ముఖ్యావసరం అంటాడు. ఎట్టి విద్య అనడానికి ఇంత చెప్పినాక ఆస్కారం లేదనుకుంటాను.

విద్యావంతుడైన వ్యక్తి, స్వేచ్ఛ పట్ల ప్రబలాభిమానంగల వ్యక్తి, ప్రకృతిని తాను జయించ గలనన్న ధీమాగల వ్యక్తి, తనకు తన స్వేచ్ఛ ఎంత అవసరమో ఇతర్లకు వారి స్వేచ్ఛ అంత అవసరం అని ఎరిగిన వ్యక్తి,(తాను నీతివంతంగా ఉండడం) ఇతర్లకొరకుగాక అంతకు భిన్నంగా తానుండలేదు గనుక నీతివంతుడగు వ్యక్తి సాంఘిక అజ్ఞానాన్ని పటాపంచలు చేయగలడు.

సాంఘిక అజ్ఞానం శాస్త్రీయదృక్పథం ఉన్న చోట బ్రతుకలేదు. శాస్త్రీయజ్ఞానం పెరిగినా శాస్త్రీయ దృక్పథం అలవరచుకోని కారణాన మనం ఈనాడు చూస్తున్న గందరగోళాలన్నీ జరుగుతున్నాయి. శాస్త్రీయ దృక్పథంమాత్రమే వ్యక్తిని క్రియాశూరుణ్ని చేస్తుంది. క్రియాశూరుడుమాత్రమే నీతివంతుడు కాగలడు. క్రియాశూరుడు బలవంతంగా కాక, స్వేచ్ఛగా నియమాల్ని అనుసరించగలడు. ఆ నియమం ఎంతవరకు తనకూ, తనపొరుగువానికీ అవసరమో అతనికి (హేతువాదం) శాస్త్రీయ దృక్పథమే తెలియ చేస్తుంది.

# పూచిన మోదుగులు

దాశరథి

నాడు మోదుగులు ఎర్రగా మండినై. అడవి అంతా వసంతంతో నిండిపోయింది. ఎన్ని ఎండలు కొట్టినా ఆ వసంతశోభ ఆవంతైనా తగ్గలేదు. ఎంత బావుంటై పూచిన మోదుగులు! మోదుగు పూచిందంటే పండగ.

ప్రతి సంవత్సరం మోదుగు పూతకోసం యెదురు చూసేవాడు సారంగపాణి. వాడికి పసితనంనుంచీ అదే పిచ్చి. మోదుగు పూలకోసం తహతహలాడే పిచ్చి వాడికి ఎన్నడూ తగ్గలేదు.

రెండేళ్ళక్రితం మోదుగుపూలు చల్లారిపోయి వానలు పడగానే జైలుకుపోయాడు సారంగపాణి. కొన్నాళ్ళు వానలూ, చలీ గడిచాక మళ్ళీ మోదుగులు పూచినాయి. మోదుగులు పూస్తున్నాయని వాటిని చూడాలని చాలా బాధపడ్డాడు సారంగపాణి.

వరంగల్లు సెంట్రల్ జైలు ఒక పెద్ద లోతైన బావిలా వుంటుంది. అందులోంచి ఆకాశం తప్పితే మరేమీ కనపడదు.

“నన్ను మరో జైలుకు మార్చండి” అని సారంగపాణి సూపరింటెండెంటుతో మొర పెట్టుకున్నాడు.

“ఎందుకూ?” అన్నాడు సూపరింటెండెంటు.

“మోదుగులు పూయగా చూడాలి.” అన్నాడు సారంగం. వాడి మాటలు సూపరింటెండెంటుకు అర్థంకాలేదు. సారంగపాణి వరంగల్లు జైల్లోనే వుండిపోయాడు.

మేము యెత్తయిన కొండ శిఖరంమీద వున్న ‘నైజామాబాద్’ జైల్లో గడిపాం వసంతం. కొండ కొమ్మున దేవాలయంలా వున్న ఆ జైల్ని నాలుగువైపులా, మోదుగులు చుట్టేసినాయి. అంతా అడవి. అడవిలో ‘నైజాం సాగర్’ చెరువు కాలవ. కాలవ పక్కగా అక్కడక్కడా

చిన్న చిన్న చెరుకు పొలాలు. నీలాలు జారిపోయే కాలవ గట్లమీద యెర్రటి మోదుగులు, చల్లని యిప్పపూల వాసన.

ఎన్ని యిబ్బందులు పడినా, నైజాం నవాబు కరకుకత్తి యెంత పదునైనా మేం ఆ వసంతం హాయిగా గడిపాం, 'నైజామాబాద్' జైల్లో. పూచిన మోదుగుల్ని చూసినప్పుడల్లా నాకు ఒకే ఒకవిచారం కలిగేది-సారంగం లేడయ్యే నేఅని.

సారంగం వరంగల్లు జైల్లోనే వున్నాడు. మోదుగులు పూచినాయి, చల్లారినాయి. వానలు మళ్ళీ వచ్చినాయి. మూడునాలుగు దీర్ఘమాసాలు సారంగం తన మోదుగుల్ని చూడకుండా యెలా గడిపాడో తెలీదు.

తీరా వానలు పడ్డాక సారంగం మా జైలుకు వచ్చాడు. కుంకుమ నోచుకోని విధవ స్త్రీలలా వున్నై మోదుగులు. వాడికి అప్పటికి ఇంకా రక్తవమన వ్యాధి పూర్తిగా తగ్గలేదు. ఎందుకో గాని చారెడు చారెడు రక్తం కక్కేవాడు. పాపం, పాడుజబ్బు దాపరించింది.

"ఎందుకు నవ్వుతావు!" అని అడిగాను.

"మోదుగులు పూచినై"అన్నాడు సారంగం.

"మోదుగులు పూచినప్పుడూ, పూచి విచ్చుకున్నప్పుడూ, అంతటా పరచుకున్నప్పుడూ నువ్వు జ్ఞాపకం వచ్చేవాడివి. తీరా అవి చల్లారిపోయాక వచ్చావు." అని విచారపడ్డాను. సారంగపాణి అందుకు జవాబుగా మళ్లీ రక్తం కక్కాడు. నాకు భయంవేసింది. చనిపోతాడేమో అనుకున్నాను.

వాడు చనిపోతాడనే తేల్చుకున్నాం—నేనూ నా మిత్రులూ, జైలు అధికార్లూ, హోం సెక్రెటరీ. విడుదల ఆర్డరు వచ్చింది సారంగపాణికి. కొండదిగుతో రక్తం కక్కి మెట్లన్నీ తడిపాడు. తడుపుతో వెళ్ళిపోయాడు.

* * *

"ఆయన జైలునించి వచ్చాక వానలూ, వాంతులూ మరీ యెక్కువైనై" అంది సారంగం భార్య రమణమ్మ యేడుస్తూ.

"మరి ఇక్కణ్ణించి యెటు వెళ్లాడు?" అని అడిగాను నేను.

"నెత్తురు కక్కడం తగ్గకుండానే ఇంట్లోంచి వెళ్ళిపోయాడు. ఎక్కడో 'బోర్డర్ క్యాంపు'లో చేరాడని విన్నాం. పోలీసులు మళ్ళీ వచ్చి ఆయన్ని వెతికారు. నన్ను కొట్టారు. నిజంగా ఆయన దగ్గిరనుంచి వుత్తరమైనా రాలేదు నాకు. ఇంకా నెలకి సైన్యాలు వొస్తయి అనగా ఒక 'గన్నూ', తోటాల బెల్టూ వేసుకుని అర్థరాత్రి ఇంటికి వచ్చాడు. చాలా నీరసంగానే వున్నాడు. భోజనం చేసి పోతూ 'పూచిన మోదుగుల' చిత్రం తీసుకుపోయాడు. మళ్ళీరాలేదు." అని యేడిచింది పెద్దగా రమణమ్మ.

జైల్లో వున్నా బావుండేదేమో మాతోపాటు చల్లగా విడుదలయేవాడు, ఈబాధంతా లేకపోయేది అనుకున్నా నేను. వాడు చనిపోయినట్టు యెక్కడా సరియైన గుర్తులు కనబడలేదు. బోర్డర్ క్యాంప్ వాళ్ల లిస్టుల్లోనూ వాడు చనిపోయినట్టు పేరు లేదు. వాళ్లూ వాడికోసం వెతికారు. నిరాశపడి వూరుకున్నారు.

సారంగపాణి యింటినిండా రమణమ్మ కన్నీళ్లే కనపడ్డయ్. భరించలేకపోయాను. ఓదార్చే వారే కనిపించలేదు. ఇంటికి వచ్చి విచారంతో మా అమ్మకు ఈ గాథంతా చెప్పాను. ఆమె ఆశ్చర్యంతో గబగబా ఇంట్లోకి వెళ్లి ఒక చిత్రం తెచ్చి యిచ్చింది. 'పూచిన మోదుగులు!'

"ఇది యెలా వొచ్చింది!" అని అడిగాను అమ్మను. ఆమె చెప్పింది—నేను జైల్లో వుండగా రహస్యంగా వొక అర్థరాత్రి సారంగం మా ఇంటికి వచ్చాడుట. వాడు పాపం, నా క్షేమ సమాచారం, జైలుగొడవా చెప్పి, భోజనంచేసి వెళ్లిపోయాడట. ఈ చిత్రం మాత్రం మరిచిపోయాడు. మళ్లీ రాలేదు.

వాడు వెళ్లిపోయిన తెల్లవారగట్లే రజాకార్లు, పోలీసులూ ఒక కాంగ్రెసువాణ్ణి చంపి 'గన్నూ', తోటాలూ తెచ్చారట. వాడే సారంగమేమో!

సైన్యాలు వచ్చాక మేం సారంగం స్మృతి చిహ్నంగా ఒక వేదిక కట్టి దానిమీద మూడు రంగులూ యెగరేశాం.

కాని వూరిచుట్టూ మోదుగులు పూచినప్పుడల్లా సారంగం వాటినీడల్లో నడయాడుతున్నట్టు అనిపిస్తుంది. రమణమ్మ సారంగంకోసం ఇప్పటికీ ఆ మోదుగులన్నీ వెతుక్కుంటోంటుంది.